క్లుప్తంగా

విద్యార్థులకు పోటీలు



అచ్చంపేట రూరల్: శ్రీకృష్ణాష్టమిని పురస్కరించుకుని ఆదివారం పట్టణంలోని పలు పాఠశాలల విద్యార్థులకు హరేకృష్ణ ఆశ్రమం ఆధ్వర్యంలో వ్యాసరచన, పెయింటింగ్, భగవద్గీత శ్లోకాలు, మహాభారతం, రామాయణంపై పరీక్షా పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఈనెల 7న బహుమతులు అందజేస్తామని గీతా ప్రచారకులు మహేశ్వరదాస్ ప్రభు తెలిపారు. జిల్లాస్థాయి పోటీలకు ఎంపికలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో నిర్వాహకులు చందు, రాజశేఖర్, గోవిందు, బాలరాజు, మురళి, శ్రీను, శివాచారి పాల్గొన్నారు.

జిల్లా కమిటీ ఎన్నిక

తెలకపల్లి: మండల కేంద్రంలో మ్యూజిక్ నిరుద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం తెలంగాణ డ్రాయింగ్, క్రాఫ్ట్, మ్యూజిక్ నిరుద్యోగుల సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సంఘం అధ్యక్షుడిగా పి రామస్వామి, ఉపాధ్యక్షుడిగా కె తిరుపతయ్య, జనరల్ సెక్రెటరీ శివకుమార్, కోశాధికారి రమేష్, మహిళా కార్యదర్శిగా జ్యోతి, ప్రచార కార్యదర్శి నాగరాజు, కార్యవర్గ సభ్యులుగా దీప్తి, రమేష్, వరూధినిదేవి, అరుణ, రమేష్ ఎన్నికయ్యారు.

నేడు లింగారెడ్డి స్తూపం ఆవిష్కరణ

నాగర్‌కర్నూల్‌రూరల్: దివంగత తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, సీనియర్ కమ్యూనిస్ట్ నాయకులు లింగారెడ్డి స్తూపాన్ని సోమవారం ఆవిష్కరించనునట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం బాల్‌నర్సింహ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ఉయ్యాలవాడ మెడికల్ కళాశాల ఎదురుగా నిర్మించిన లింగారెడ్డిగారి స్తూపాన్ని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ఆవిష్కరిస్తారని పేర్కొన్నారు.

బైక్ అదుపుతప్పి ఇద్దరికి గాయాలు

తెలకపల్లి: బైక్ అదుపుతప్పి ఇద్దరికి గాయాలైన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం నాగర్‌కర్నూల్‌కు చెందిన మున్సిపల్ సిబ్బంది శేఖర్, హుస్సేన్‌లు బైక్‌పై మండల కేంద్రం నుంచి నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రానికి వెళ్తున్నారు. మార్గమధ్యంలో మండలంలోని అనంతసాగర్ గేటు వద్ద బైక్ అదుపు తప్పి కిందపడ్డారు. ఈ ప్రమాదంలో శేఖర్, హుస్సేన్‌లకు గాయాలయ్యాయి. 108 వాహనంలో నాగర్‌కర్నూల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

ముఖ్యమంత్రిని కలిసిన గోలి శ్రీనివాస్‌రెడ్డి



కల్వకుర్తి: ఫుడ్ కమిషన్ రాష్ట్ర చైర్మన్‌గా నియమితులైన గోలి శ్రీనివాస్‌రెడ్డి ఆదివారం ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ప్రగతిభవన్‌లో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా చైర్మన్‌కు సీఎం కేసీఆర్ శుభాకాంక్షలు తెలిపి సత్కరించారు.

ఫుడ్ కమిషన్ చైర్మన్‌కు సన్మానం

కల్వకుర్తిరూరల్: ఫుడ్ కమిషన్ రాష్ట్ర చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డిని ఆదివారం పలువురు నాయకులు ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా భారత జాగృతి విద్యార్థి విభాగం జిల్లా కన్వీనర్ గణేష్, వెంకట్‌రెడ్డి తదితరులు చైర్మన్‌ను శాలువాతో సత్కరించి మొక్కను బహూకరించారు.

నేటి ధర్నాకు తరలిరావాలి

కల్వకుర్తిరూరల్: రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను నిరసిస్తూ సోమవారం హైదరాబాద్‌లో నిర్వహించనున్న మహాధర్నాకు నియోజకవర్గం నుంచి అధిక సంఖ్యలో తరలిరావాలని టీడీపీ రాష్ట్ర లీగల్‌సెల్ కార్యదర్శి యాదిలాల్ కోరారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో మల్లయ్య, భాస్కర్, పద్మనాభం, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

అచ్చంపేట రూరల్: సంక్షేమ పథకాల అమలులో ప్రభుత్వ వివక్ష, నిర్లక్ష్య వైఖరికి నిరసనగా సోమవారం హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు ధర్నా చౌక్ వద్ద నిర్వహించే మహాధర్నాను విజయవంతం చేయాలని టీడీపీ అచ్చంపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ మోపతయ్య ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి కార్యకర్తలు, నాయకులు అధిక సంఖ్యలో హాజరు కావాలని ఆయన కోరారు.

నామమాత్రంగా క్రీడా ప్రాంగణాలు

ఉప్పునుంతల: గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం గ్రామాల్లో క్రీడాప్రాంగణాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. ప్రభుత్వ లక్ష్యం బాగానే ఉన్నా కొన్ని గ్రామాల్లో క్రీడా ప్రాంగణాలకు స్థలాలు లేకపోవడంతో ఉన్న కొద్ది స్థలంలోనే క్రీడా మైదానాలు నిర్మించి అధికారులు చేతులు దులుపుకున్నారు. మరి కొన్ని గ్రామాల్లో నామమాత్రంగా ఏర్పాటు చేసినా అందుబాటులో రాలేదు. దీంతో గ్రామీణ యువత ఆడుకునేందుకు స్థలాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉన్నతాధికారులు ఒత్తిడితో మండల స్థాయి అధికారులు చేసేదిలేక స్థానికంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న కొద్ది పాటి ఆట స్థలంలోనే క్రీడా ప్రాంగణాలుగా బోర్డులు ఏర్పాటు చేశారు. మరికొన్ని గ్రామాల్లో చెరువు శిఖం భూముల్లో, ఆటలు ఆడుకోవడానికి అనువుగా లేని స్థలాలను ఎంపికచేశారు. మండలంలోని 27 గ్రామ పంచాయతీల్లో స్థలాలు ఎంపిక చేసి బోర్డులు మాత్రం పెట్టారు. మండలంలోని మర్రిపల్లిలో గ్రామ సమీపంలోని చెరువు శిఖం భూమిలో క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేయడంతో చెరువు నిండితే నీట



మర్రిపల్లిలో చెరువు శిఖం భూమిలో ఏర్పాటుచేసిన క్రీడా ప్రాంగణం

మునిగిపోయే పరిస్థితి ఉంది. సీబీ తండాలో ఎంపిక చేసిన స్థలం బండ రాళ్లతో కూడిన అనువుగా లేని స్థలంలో బోర్డును పెట్టారు. లక్ష్మాపూర్, సూర్య తండాలలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న కొద్ది పాటి స్థలాన్ని ఎంపిక చేశారు. ఉప్పునుంతల జెడ్పీహెచ్ఎస్, పెనిమిళ్ల జెడ్పీహెచ్ఎస్‌లో ఉన్న ఆట స్థలాలనే క్రీడా ప్రాంగణాలుగా చూపించారు. మండలంలోని 27 గ్రామ పంచాయతీల్లో మైదానాలను అభివృద్ధి చేయడానికి రూ. కోటికి పైగా నిధులు మంజూరు కాగా ఇప్పటివరకు 21 గ్రామ పంచాయతీల్లో కేవలం రూ.8 లక్షలు మాత్రమే ఖర్చుచేసి ఎంపిక చేసిన స్థలాల్లో కొంతమేర మొర్రం వేసి చదును చేశారు. 6 గ్రామ పంచాయతీల్లో ఇప్పటివరకు ఏమాత్రం క్రీడా ప్రాంగణాల అభివృద్ధి పనులు చేపట్టలేదు.



ప్రభుత్వ స్థలాలు లేక..



గ్రామాల్లో క్రీడా ప్రాంగణాల కోసం ప్రభుత్వ స్థలాలు అందుబాటులో లేవు. దీంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. స్థానికంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లోనే క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేశాం. అందుబాటులో ఉన్న స్థలాలను ఎంపిక చేసి మట్టి, మొర్రం వేసి చదును చేస్తున్నాం. ఆటలకు సంబంధించిన అన్ని రకాల సామగ్రి అందుబాటులో ఉన్నాయి. కిట్లను గ్రామ పంచాయతీలకు అప్పగిస్తాం.

– లక్ష్మణ్‌రావు, ఎంపీడీఓ ఉప్పునుంతల

ఘనంగా మహంకాళి బోనాలు


హాజరైన కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

వెల్దండ: మండలంలోని భర్కత్‌పల్లిలో ఆదివారం మహంకాళి బోనాలు నిర్వహించారు. మహిళలు బోనాలతో ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. నైవేద్యాన్ని సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ బీరయ్య, నాయకులు గోపాల్‌నాయక్, వెంకటయ్యగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటయ్యయాదవ్, ఉప సర్పంచ్‌లు నర్సింహ, నర్సింహముదిరాజ్ తదితరులు ఉన్నారు.

విశ్వబ్రాహ్మణులను ఆదుకోవాలి

తాడూరు: గ్రామీణ ప్రాంతాలలో చేతివృత్తులను నమ్ముకొని జీవించే విశ్వబ్రాహ్మణులను ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని విశ్వబ్రాహ్మణ సంఘ మండల నాయకులు అనంతరాం, కృష్ణమాచారి, రామాచారీలు కోరారు. ఆదివారం మండల కేంద్రంలోని స్థానిక చెన్నకేశవస్వామి ఆలయ ఆవరణలో మండల విశ్వబ్రాహ్మణ సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చేతి వృత్తులవారికి అందజేసేందుకు అమలు చేసిన రూ.లక్ష పథకాన్ని విశ్వబ్రాహ్మణులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అనంతరం మండల విశ్వబ్రాహ్మణ సంఘం రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన నిజప్రతులను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సంఘం నాయకులు చంద్రమౌళి, భాస్కరాచారి, ఆంజనేయులు, తిరుపతాచారి, విశ్వనాథం, బాలకృష్ణ, శ్రీనివాసాచారిలు తదితరులు పాల్గొన్నారు.


నిజప్రతులు ఆవిష్కరిస్తున్న నాయకులు

ఓటు నమోదు సద్వినియోగం చేసుకోవాలి


తాడూరులో ఓటు నమోదు దరఖాస్తులు స్వీకరిస్తున్న బీఎల్ఓలు


చారకొండలో

తాడూరు: అర్హులందరూ ఓటు నమోదును సద్వినియోగం చేసుకోవాలని రెవెన్యూ అధికారులు మహమ్ముద్‌అలీ, శ్రీనివాసులు పేర్కొన్నారు. ఆదివారం ప్రత్యేక ఓటరు నమోదు కేంద్రాలను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో 37 పోలింగ్ కేంద్రాలలో ఓటు నమోదు చేస్తున్నట్లు తెలిపారు. 220 దరఖాస్తులు కొత్తగా నమోదు కోసం అందినట్లు అధికారులు తెలిపారు. అనంతరం బీఎల్ఓలు దరఖాస్తులను స్వీకరించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల బీఎల్ఓలతోపాటు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

చారకొండ: అర్హత ఉన్న యువతీ, యువలకులు ఓటు నమోదు చేసుకోవాలని తహసీల్దార్ ప్రమీల కోరారు. ఆదివారం మండలంలోని అన్ని బూత్‌ల వారీగా ఓటు నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పలు బూత్‌లను పరిశీలించారు.

విద్యుత్‌షాక్‌తో ఎద్దు మృతి

లింగాల: విద్యుదాఘాతంతో ఎద్దు మృతి చెందిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం గ్రామానికి చెందిన రైతు హరిపల్లి నారాయణ సంబంధించిన ఎద్దు అంబట్‌పల్లి శివారులో మేత మేస్తుండగా ప్రమాదవశాత్తు ఎర్త్ వైర్‌కు తగిలి విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతి చెందింది. మృతి చెందిన ఎద్దు విలువ రూ. 75 వేలు ఉంటుందని బాధితుడు పేర్కొన్నాడు. సింగిల్ విండో చైర్మన్ హన్మంత్‌రెడ్డి సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

తగ్గిన భక్తుల రద్దీ



పెద్దకొత్తపల్లి: నాయనోనిపల్లి మైసమ్మ జాతరకు భక్తులు ఆదివారం తక్కువ సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. శనివారం అర్ధరాత్రి నుంచి కురిసిన వర్షంతో పాటు శ్రావణమాసం కారణంగా భక్తుల తక్కువ సంఖ్యలో వచ్చారు. ఆదివారం మొత్తం 3వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.

శంకుస్థాపనకే పరిమితమా!

మన్ననూర్: అమ్రాబాద్ మండలం ప్రశాంతినగర్ గ్రామంలో బీటీ రోడ్డు నిర్మాణానికి మూడు నెలల కిందట మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే గువ్వల బాలరాజ్ శంకుస్థాపన చేశారు. అయినా ఇప్పటివరకు ఎటువంటి పనులు చేపట్టలేదు. బీటీ రోడ్డు నిర్మిస్తారో తెలియని అయోమయస్థితిలో గ్రామస్తులు పడ్డారు. ఇంకా రెండు నెలల్లో ఎన్నికల కోడ్ వస్తుందని పనులు ఎలా చేస్తారని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. వెంటనే బీటీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు. అమ్రాబాద్ మండలం ప్రశాంతినగర్ గ్రామానికి వెళ్లే దారి కాలు తీసి కాలు వేయలేని దుస్థితి నెలకొంది. అధికారులు, ప్రజాప్రతినిధులు రోడ్డు పనుల ఊసే ఎత్తడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆచరణకు నోచుకోని అభివృద్ధి పనులకు పాలకులు ప్రారంభోత్సవాలు చేస్తూ మరోసారి మోసం చేసి రాబోయో ఎన్నికలలో ఓట్లు దండుకునేందుకు చేస్తున్న మోసమని గ్రామస్తుడు బర్పటి సుధాకర్ ఆరోపించారు. బీటీ రోడ్డు నిర్మించాకే ఎమ్మెల్యే గ్రామానికి రావాలని లేనిపక్షంలో గ్రామానికి రానివ్వమని గ్రామస్తులు పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకొని పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కోరరుతున్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక



కొల్లాపూర్: పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి సమక్షంలో ఆదివారం చిన్నంబావి మండల కేంద్రానికి చెందిన మాజీ మంత్రి జూపల్లి వర్గీయులు బీఆర్‌ఎస్‌లో చేరారు. పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో గోపినాయుడు, పి.వెంకటస్వామి, చిరంజీవి, స్వామి తదితరులున్నారు.

సేవతోనే సంతృప్తి



కల్వకుర్తిరూరల్: సామాజిక సేవతోనే సంతృప్తి కలుగుతుందని వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ రమేష్‌బాబు అన్నారు. వాసవీక్లబ్ వ్యవస్థాపకుడు కల్వకుంట్ల చంద్రసేన్ గుప్త జయంతి వారోత్సవాల సందర్భంగా ఆదివారం పట్టణంలోని పశువుల సంతలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రతి ఒక్కరు సేవాగుణం అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో శంకర్, క్లబ్ అధ్యక్షుడు శ్రీనివాసులు, కోశాధికారి అశోక్, వనితా క్లబ్ కోశాధికారి ధనలక్ష్మి, సత్యం పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి భూమి పూజ



లింగాల: మండలంలోని మగ్దూంపూర్‌లో లంబాడ కులదైవం మేరమ్మ భవానీ ఆలయ నిర్మాణానికి ఆదివారం సర్పంచ్ హన్మంత్‌నాయక్ భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ దాతల సహకారంతో గ్రామంలో ఆలయ నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. పీఏసీఎస్ మాజీ చైర్మన్ కొండల్‌రావు, డాక్టర్ రవిశంకర్, సైదులు, శంకర్, శ్రీను పాల్గొన్నారు.

ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు ఆహ్వానం



అచ్చంపేట రూరల్: ఈ నెల 10న పట్టణంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో నిర్వహించే నల్లమల నగార బహిరంగ సభకు హాజరుకావాలని ఆదివారం నల్లమల ప్రాంత బీఎస్పీ నాయకులు హైదరాబాద్‌లో బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. నల్లమల ప్రాంతంలోని సమస్యలను వివరించారు. సభకు హాజరు కావాలని ఆహ్వానించగా తప్పకుండా వస్తానని హామీ ఇచ్చారని బీఎస్పీ అసెంబ్లీ ఇన్‌చార్జ్ మోత్కూరి నాగార్జున తెలిపారు. యోసేఫ్, నాగన్న, నాగార్జున పాల్గొన్నారు.

గిరిజనులపై వివక్ష తగదు

కొల్లాపూర్ రూరల్: రాష్ట్ర ప్రభుత్వం గిరిజనులపై వివక్ష చూపుతోందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు అశోక్ నాయక్ ఆరోపించారు. ఆదివారం మండలంలోని ముక్కిడిగుండంలో ఏర్పాటు చేసిన గిరిజనుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం అయ్యిందన్నారు. ఈ నెల 19 వ తేదీ నుంచి 21 వరకు తమిళనాడు రాష్ట్రంలో జాతీయ మహాసభలు నిర్వహిస్తునట్లు పేర్కొన్నారు.

హామీల అమలులో బీఆర్‌ఎస్ విఫలం


నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

నాగర్‌కర్నూల్‌రూరల్: హామీల అమలులో బీఆర్ఎస్ విఫలం అయ్యిందని సీపీఎం మండల కార్యదర్శి జి అశోక్ అన్నారు. ఆదివారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా దేశిటిక్యాలలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాల్లు నిత్యవసర వస్తువుల ధరలు పెంచి సామాన్యులపై భారం మోపిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేకా విధానాలపై వారం రోజులపాటు నిరసన కార్యక్రమాలు కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు బచ్చలు, రాములు, ఆంజనేయులు, కురుమయ్య, మశన్న, రాజు, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీలకు రగ్గులు పంపిణీ

మన్ననూర్: నల్లమల ఆటవీ లోతట్టు ప్రాంతంలోని ఆదివాసీలకు రూరల్ ఫౌండేషన్ చంద్రశేఖర్ కొండ ఎన్ఆర్ఐ సహకారంతో ఆదివారం రగ్గులు పంపిణీ చేశారు. పుల్లాయిపల్లి, ఈర్లపెంట, పిల్లిగుండ్ల, కొల్లం, కొమ్మెనపెంట చెంచు పెంటల్లో నివాసం ఉంటున్న సుమారు 150 కుటుంబాలకు అందజేశారు. ఇప్పటివరకు పది సంవత్సరాల నుంచి చెంచులకు రూ.15 లక్షల వరకు ఖర్చు చేశామని ఫౌండేషన్ సభ్యుడు శివ రాచర్ల తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు బాలకృష్ణ, సైదులు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.


పిల్లిగుండ్ల చెంచు పెంటలో రగ్గులు అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

వచ్చే ఎన్నికల్లో గుణపాఠం చెబుదాం


మాట్లాడుతున్న మల్లేష్‌ముదిరాజ్

వెల్దండ: ముదిరాజ్ కులస్తులకు టికెట్లు ఇవ్వని పార్టీలకు వచ్చే ఎన్నికల్లో గుణపాఠం చెబుదామని ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు మల్లేష్‌ముదిరాజ్ కోరారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముదిరాజ్ కులస్తులు ఏకం కావాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణముదిరాజ్, లింగం ముదిరాజ్, బొక్కల శ్రీను ముదిరాజ్, ఎర్రశ్రీను, శ్రీశైలం, మల్లేష్, రమేష్, గోపాల్, తదితరులు ఉన్నారు.

ముఖద్వార నిర్మాణానికి భూమిపూజ

వెల్దండ: మండల కేంద్రంలోని మల్లయ్యదేవాలయ ముఖద్వార నిర్మాణానికి యెన్నం ఆస్పత్రి చైర్మన్ డాక్టర్ హరిత్‌రెడ్డి సహకారంతో ఆదివారం భూమి పూజ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరగా నిర్మాణ పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ భూపతిరెడ్డి, ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు బచ్చు రామకృష్ణ, సింగిల్ విండో వైస్ చైర్మన్ సంజీవ్‌కుమార్, ఉప సర్పంచ్ నిరంజన్, నాయకులు అమర్‌నాథ్, నిరంజన్, మల్లయ్య, రవీందర్, శ్రీశైలం తదితరులు ఉన్నారు.


భూమిపూజ చేస్తున్న డాక్టర్ హరిత్‌రెడ్డి

వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఆదరించాలి


ర్యాలీగా వెళ్తున్న సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి

చారకొండ: రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఆదరించాలని కల్వకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ నాయకుడు, ఐక్యతా ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని నియోజకవర్గ గ్రామాలు జేపల్లి, దొంగలగుట్టతండా, దొడ్లపల్లి, నేమలిగుట్ట తండాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ జెండాలను ఆవిష్కరించారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రకటించిన డిక్లరేషన్‌లో ఎస్సీ, ఎస్టీలకు జరిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో నాయకులు మణిపాల్, వార్డు మెంబర్లు, వరలక్ష్మి, నాయకులు సీరాజ్, అశోక్, రామస్వామి కార్యకర్తలు, గ్రామస్తులు ఉన్నారు.

నిరుపయోగంగా శ్మశాన వాటిక

తాడూరు: మండల కేంద్రంలో నిర్మించిన శ్మశాన వాటిక గ్రామానికి 4 కిలోమీటర్ల దూరంలో నిర్మించారు. దీంతో గ్రామస్తులకు ఉపయోగం లేకుండా పోతోందని స్థానికులు వాపోయారు. గ్రామంలో శ్మశానవాటిక ఉన్నా నిరుపయోగంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు పరిశీలించి ప్రజలకు అందుబాటులో ఉండే స్థలాన్ని ఎంపిక చేసి మరో శ్మశాన వాటికను నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.


తాడూరులో శ్మశాన వాటిక

బంజారాల అభ్యున్నతికి కృషి


నృత్యం చేస్తున్న మహిళలు

లింగాల: బంజార అభ్యున్నతికి కృషి చేస్తానని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అన్నారు. మండలంలోని దారారంలో 9 రోజుల పాటు సర్పంచ్ కవిత శ్రీనునాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన తీజ్ వేడుకలు నిర్వహిస్తున్నారు. ఆదివారం ముగింపు సందర్భంగా ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే గువ్వల హాజరై మాట్లాడారు. తెలంగాణ సంస్కృతీ, సంప్రదాలయాలకు నిలువుటద్దంగా తీజ్ వేడుకలు నిలుస్తాయన్నారు. 9 రోజుల పాటు ఎంతో నియమ నిష్టలతో పర్వదినం జరుపుకోవడం చాలా గొప్ప విషయమన్నారు. గ్రామంలో మేరమ్మ భవాని ఆలయ నిర్మాణం కోసం రూ.5 లక్షలు ఇస్తానని హామీ ఇచ్చారు. లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా ఈ ప్రాంతానికి సాగునీటిని అందిస్తామన్నారు. ప్రభుత్వ విప్ గిరిజనులతో కలిసి నృత్యం చేశారు. మహిళలు తీజ్ బుట్టలను తలపై ఉంచుకొని భారీ ఊరేగింపు మధ్య సమీపంలోని చెరువులో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కేటీ తిర్పతయ్య, సింగిల్ విండో చైర్మన్ హన్మంత్‌రెడ్డి, వైస్ చైర్మన్ వెంకటగిరి, మాజీ జెడ్పీటీసీ మాకం తిర్పతయ్య, ఆయా గ్రామాల సర్పంచ్, నాయకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు

శిథిలావస్థలో నూతన భవనం

తాడూరు: మండలంలోని ఇంద్రకల్‌లో దశాబ్ద కాలం కిందట రూ.8 లక్షలతో బీసీ బాలుర ప్రాథమిక పాఠశాల భవనాన్ని నిర్మించారు. ఇప్పటివరకు ప్రారంభించకపోవడంతో శిథిలావస్థకు చేరింది. అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యంతో ప్రజాధనం వృథా అయ్యిందని పలువురు వాపోయారు. వెంటనే పాఠశాలను ప్రారంభించి వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.


ఇంద్రకల్‌లో శిథిలావస్థకు చేరిన పాఠశాల భవనం